సాక్షి తిరుపతి

ఆదివారం। 26। జనవరి। 2025




పకడ్బందీగా గణతంత్ర ఏర్పాట్లు

గణతంత్ర దినోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టారు. పోలీస్ పరేడ్ మైదానంలో రిహార్సల్స్ నిర్వహించారు. - IIలో



డ్రైవర్ల చేతుల్లోనే..

ప్రజల ప్రాణాలు డ్రైవర్ల చేతుల్లోనే ఉంటాయన్న విషయాన్ని గుర్తించుకోవాలని డీటీఓ మురళీమోహన్ తెలిపారు. - IIలో



కాసులు ముట్టాయా..?

ఎస్వీయూ అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయి. డీడీఈ పరీక్ష కేంద్రాల ఏర్పాటు విమర్శలకు తావిస్తోంది. - IIలో

న్యూస్‌రీల్

మాడుగలకు తిరుపతితో విడదీయరాని అనుబంధం



మాడుగుల నాగఫణి శర్మ

తిరుపతి సిటీ: పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన మాడుగల నాగఫణి శర్మకు తిరుపతితో విడదీయరాని బంధం ఉంది. తిరుపతిలోని ఓరియంటల్ కళాశాలలో ఆయన డిగ్రీ విద్యాభ్యాసం చేశారు. ఆర్‌ఎస్ గార్డన్‌లో ప్రాంతంలో ఉంటూ వారాలబ్బాయిగా జీవనం సాగిస్తూ డిగ్రీ పట్టా పొందారు. రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠంగా పిలవబడే ప్రస్తుత జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సాహిత్య విభాగంలో పరిశోధక విద్యార్థిగా ప్రొఫెసర్ సన్నిదానం సుదర్శన శర్మ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తిచేశారు. 1990–92 మధ్య కాలంలో టీటీడీ ధర్మప్రచార పరిషత్ అదనపు కార్యదర్శిగా సేవలందించారు.

వారికి జామీను ఇవ్వొద్దు!

తిరుపతి మంగళం: ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో తెలియని ముద్దాయిలకు జామీను ఇచ్చి ఇబ్బందులు పడొద్దని ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దీనిని కోర్టు తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. 2017లో తమిళనాడుకు చెందిన ముద్దాయికి జామీను ఇచ్చిన ఇద్దరికి శనివారం కోర్టు రూ.25 వేలు చొప్పున జరిమానా విధించింది. క్రైమ్ నం31/2017 కేసులో తమిళనాడు తిరువణ్ణామలైకి చెందిన ఏ.వెల్లికన్నన్ అనే ముద్దాయికి తిరుపతి జిల్లా ఎర్రవారిపాళ్యంకు చెందిన ఎం.గోబ్రీ నాయక్ (47), ఎం.శ్రీరాములు నాయక్ (67)కు జామీను ఇచ్చారు. అయితే వారు కోర్టు వాయిదాలకు హాజరు కావడం లేదు. దీంతో ఆర్‌ఎస్ఎస్ ఏడీజె కోర్టు జామీను ఇచ్చిన ఇద్దరికీ రూ.25 వేలు చొప్పున జరిమానా విధించింది. ఎర్రచందనం కేసుల్లో తెలియని ముద్దాయిలకు జామీను ఇచ్చే ముందు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



టీటీడీ పరిపాలన భవనం వెనుకనున్న పరేడ్ మైదానంలో గణతంత్ర ఏర్పాట్లు

తిరుపతి కల్చరల్: గణతంత్ర దినోత్సవానికి సర్వం సిద్ధమైంది. టీటీడీ పరిపాలనా భవనంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. టీటీడీ పరిపాలన భవనం వెనుకనున్న పరేడ్ మైదానంలో టీటీడీ ఈఓ జే.శ్యామలరావు జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. విధి నిర్వహణలో ప్రతిభ చాటిన ఉద్యోగులకు ఉత్తమ అవార్డులు ప్రదానం చేయనున్నారు.

రసాయన రహిత ఆహారమే లక్ష్యం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పద్మశ్రీ సుభాష్ పాలేకర్

తిరుపతి సిటీ: ప్రజలకు రసాయన రహిత ఆహారం అందించడమే తన అంతిమ లక్ష్యమని సేంద్రియ విప్లవ పితామహుడు, పద్మశ్రీ సుభాష్ పాలేకర్ పేర్కొన్నారు. శనివారం తిరుపతి ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియం వేదికగా వ్యవసాయం వైపు యువతను ప్రోత్సహించేందుకు నిర్వహించిన 'సుభాష్ పాలేకర్ వ్యవసాయం(క్రిషి)' అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడు తూ వ్యవసాయరంగంలో యువతకు బంగారు భవిష్యత్ ఉందన్నారు. భూ మాతను యువత ఇష్టంగా ప్రేమించి సంరక్షించుకోవాలని సూచించారు. కెమికల్స్ రహిత ఆహారాన్ని అందించే లక్ష్యంతో తుదిశ్వాస వరకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ మాట్లాడుతూ యువత 30 ఏళ్లలోపే లక్ష్యాన్ని నిర్ధారించుకుని ఛేదించాలన్నారు. సివిల్స్, వ్యవసాయరంగంపై యువత దృష్టి సారించాలని చెప్పారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రులు విద్యతో పాటు వ్యవసాయంపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు మాట్లాడుతూ వ్యవసాయరంగంలో ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. సదస్సు ఆర్గనైజర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, డీన్ ఎస్‌సీ.రాయుడు, ప్రిన్సిపల్ కేటీ.రామకృష్ణారెడ్డి హాజరయ్యారు.



సత్యవేడు నియోజకవర్గం, సంతవేలూరులో కొట్టుకుపోయిన వరి నారుమళ్లు(ఫైల్)



అక్టోబర్‌లో వచ్చిన వర్షాలతో వేనాడులో మొలకెత్తిన వరి

పరిహారం.. పంగనామం!

కూటమి నేతలు రైతులను పూర్తిగా విస్మరించారు. ఆరుగాలం శ్రమించి పట్టెడన్నం పెట్టే అన్నదాతను నిట్టనిలువునా ముంచేస్తున్నారు. గత ఆరు నెలలుగా ప్రకృతి ప్రకోపంతో ఉక్కిరిబిక్కిరవుతున్న అన్నదాతను ఆదుకోవాల్సింది పోయి నష్టాలు ఊబిలోకి నెట్టేస్తున్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా.. పంట నష్టపరిహారానికి పంగనామాలు పెడుతున్నారని పలువురు విమర్శలు ఎక్కుపెడుతున్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి పరిహారాన్ని సత్వరం విడుదల చేయాలని కర్షకులు కోరుతున్నారు.

ఆరు నెలలుగా ప్రకృతి ప్రకోపం

- పంట నష్టం అపారం
- పరిహారం శూన్యం
- ఆపసోపాలు పడుతున్న 20 వేల మంది రైతులు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు
- కన్నెత్తి చూడని కూటమి నేతలు

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రకృతి పగబట్టింది. వరుస వర్షాలతో రైతులను అతలాకుతలం చేసింది. గత ఆగస్టు, అక్టోబర్, డిసెంబర్‌లో భారీ వర్షాలతో ముంచెత్తింది. ఒక్క పెంగల్ తుపాన్‌తోనే జిల్లా వ్యాప్తంగా 5,600 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లింది. అయితే పాలకులు మేజర్‌గా దెబ్బతిన్న పంట వివరాలే నమోదు చేసి నివేదికలు పంపడం విమర్శలకు తావిస్తోంది.

గత ఆగస్టులో 550 హెక్టార్లలో నష్టం

గత ఏడాది ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు రేణిగుంట, దొరవారిసత్రం, వడమాలపేట, తడ మండలాల్లో 550 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లింది.



సూళ్లూరుపేటలో తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంట, చెరువులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ (ఫైల్)

అయితే వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం ఈ నాలుగు మండలాల్లో 74 మంది రైతులకు సంబంధించి 54.24 హెక్టార్లలో మాత్రమే పంట నష్టం జరిగినట్లు నివేదిక ఇచ్చారు. ఆ ప్రకారం హెక్టార్‌కు రూ.25 వేలు చొప్పున రూ.13.56 లక్షలు చెల్లించారు.

డిసెంబర్‌లో భారీ నష్టం

గత ఏడాది డిసెంబర్‌లో పెంగల్ తుపాన్ బీభత్సం సృష్టించింది. జిల్లాలోని 34 మండలాలకు గాను 25 మండలాల్లో 5,600 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయశాఖ అధికారులు 12 మండలాల్లో మాత్రమే పంట నష్టం వాటిల్లినట్టు చెబుతున్నారు. ఈ లెక్కన 658 మంది రైతులకు చెందిన 455.37 హెక్టార్లలో నష్టం జరిగిందని, ఒక్కో హెక్టారుకు రూ.17వేల చొప్పున మొత్తం రూ.77.41 లక్షలు చెల్లించాల్సి ఉందని అంటున్నారు. అలాగే 32.73 హెక్టార్లలో ఇసుక మేటలు వేయగా ఒక్కో హెక్టారుకు రూ.18 వేల చొప్పున రూ.5.89 లక్షలు 75 మంది రైతులకు చెల్లించాలని లెక్కలు గట్టారు. వరిపంట కోత దశలో 20.60 హెక్టార్లలో దెబ్బతినగా ఒక్కో హెక్టారుకు రూ.47 వేలు చొప్పున రూ.9.68 లక్షలు చెల్లించాలని ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. దీని కోసం 65 మంది రైతులు ఎదురు చూస్తున్నారు.

అక్టోబర్‌లో 3.62 హెక్టార్లేనట!

గత ఏడాది అక్టోబర్‌లో సత్యవేడు, తడ మండలాల్లో భారీగా పంట నష్టం వాటిల్లింది. వ్యవసాయ శాఖ అధికారులు ఆ రెండు మండలాల్లో ముగ్గురు రైతులకు చెందిన 3.62 హెక్టార్లలో మాత్రమే పంట నష్టం జరిగినట్టు ప్రతిపాదనలు పంపించారు. వారికి హెక్టారుకు రూ.17వేలు చొప్పున పరిహారం చెల్లించాల్సి ఉంది.

నాలుగు ఎకరాల్లో పంట పాచిపోయింది



పెంగల్ తుపాన్‌తో నాలుగు ఎకరాల్లో వరిపంట మునిగిపోయింది. ఐదు రోజులుగా నీటిలో నానడంతో పంట మొత్తం పాచిపోయింది. మళ్లీ పెట్టుబడి పెట్టాలంటే అప్పులు చేయక తప్పలేదు. ప్రభుత్వం పరిహారం చెల్లించకుండా నన్ను దం విడ్డూరంగా ఉంది. – వెంకటేశ్వర్లు, రైతు, సూళ్లూరు గ్రామం, సూళ్లూరుపేట మండలం

కొందరికే పరిహారం



పెంగ తుపాన్‌తో పెద్ద ఎత్తున రైతులు నష్టపోయారు. ప్రధానంగా వరి పంట దెబ్బతిన్నది. అయితే వ్యవసాయశాఖ అధికారులు అందిరికీ న్యాయం చేయకుండా కొందరికి మాత్రమే పరిహారం ఇచ్చేలా లెక్కలు రాసుకున్నారు. నేను సాగు చేసిన 2.8 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. రూ.50వేల వరకు నష్టం వచ్చింది. –భాస్కర్, పీవీపురం గ్రామం, సత్యవేడు మండలం

విత్తనాలు కూడా ఇవ్వలేదు



నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేద్దామని నార్ల మళ్లు పోశా. ఈలోగా పెంగల్ తుపాను వచ్చింది. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు అధికంగా పొలాలపై ప్రవహించింది. 15 రోజులు నీరు తగ్గకుండా ఉండి పోయింది. దీంతో నాలుగు ఎకరాలకు పోసుకున్న నారు మళ్లు మురిగి పోయాయి. సుమారు రూ.30 వేల వరకు నష్టం వాటిల్లింది. మళ్లీ నారు పోసుకునేందుకు ప్రభుత్వం కనీసం విత్తనాలు కూడా అందించలేదు. – పామంజి నాగరాజు, ఆరూరు, చిట్టమూరు మండలం

రూ.22 వేలు నీటిపాలు



రెండు ఎకరాల్లో విత్తిన వేరుశనగ విత్తనాలు తుపాను ప్రభావంతో కొట్టుకుపోయాయి. దుక్కి దున్నడానికి, ఎరువులకు, విత్తనాలు విత్తడానికి మా కష్టం పోను రూ.22 వేలకు పైగా ఖర్చు అయింది. పంట నష్టాన్ని చూడడానికి అధికారులు రాకపోగా.. వివరాలను కూడా తీసు కోలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో వర్షాలకు పంట దెబ్బతిన్న నెల లోపే పరిహారాన్ని అందుకున్నాము. కూటమి ప్రభు త్వం వ్యవసాయాన్ని పూర్తిగా విస్మరించింది. – గురుస్వామినాయుడు, అరణ్యంకండ్రిగ, నారాయణవనం మండలం

పంట తుడిచిపెట్టుకు పోయింది



ఇటీవల కురిసిన భారీవర్షాలకు నేను సాగు చేసిన ఏడు ఎకరాల వరి పంట తుడిచిపెట్టుకు పోయింది. వెన్ను దశలో ఉన్న పంట నేల వాలిపోయింది. పంట కోసుకునే పరిస్థితి లేక తీవ్రంగా నష్టపోయాను. ఒక్కో ఎకరాకు రూ.30 వేల చొప్పున పెట్టుబడి పెట్టాను. వ్యవసాయ శాఖ అధికారులు పంటనష్టాన్ని నమోదు చేసుకుని వెళ్లారు గానీ.. ఇంతవరకు పరిహారం ఇవ్వలేదు. – శివాజీనాయుడు, రాచర్ల, వరదయ్యపాళెం మండలం

ప్రతిపాదనలు పంపించాం



జిల్లాలోని మండల వ్యవసాయశాఖ అధికారులు ఇచ్చిన వివరాల మేరకు పరిహారం కోసం ప్రతిపాదనలు పంపించాం. గత ఏడాది ఆగస్టులో వచ్చిన వర్షాలకు ఇవ్వాల్సిన పరిహారం ఇచ్చాం. అయితే అక్టోబర్‌లో వచ్చిన వర్షాలకు, డిసెంబర్‌లో పెంగల్ తుపాన్‌తో జరిగిన నష్టానికి సంబంధించి వివరాలను ప్రతిపాదించాం. పరిహారం వచ్చిన వెంటనే రైతుకు చెల్లిస్తాం. – ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

కుమ్ములాటలో మునగంగ!

- తిరుపతి గంగమ్మ ఆలయ చైర్మన్ కోసం నువ్వా.. నేనా?
- జనసేనకు ఇవ్వాలని పట్టుబడుతున్న నేతలు
- టీడీపీకే చైర్మన్ పదవి అంటూ నేతల హడావుడి
- టీడీపీలో ఏకంగా ఐదుగురు పోటీ

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయ చైర్మన్ పదవి కోసం కూటమి నేతల మధ్య కుమ్ములాటలు తార స్థాయికి చేరాయి. ఎమ్మెల్యే జనసేన అభ్యర్థికి ఇచ్చాము కదా.. తుడా, గంగమ్మ ఆలయ చైర్మన్ పదవులు టీడీపీ నేతలకే ఇవ్వాలని ఆ పార్టీ నేతలు పట్టుబడుతున్నారు. అయితే ఆలయ చైర్మన్ పదవి కోసం టీడీపీ నుంచి ఐదుగురు పోటీపడుతుంటే.. జనసేన నుంచి ఒకే ఒక్కరు పేరు వినిపిస్తోంది. జనసేనను నమ్ముకుని ఉన్న హరిశంకర్‌కు ఇప్పించేందుకు ఆ పార్టీ నాయకులంతా పట్టుబడుతున్నారు. డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా హరిశంకర్‌కి



తిరుపతి గంగమ్మ ఆలయం

మద్దతు తెలియజేసినట్లు సమాచారం. హరిశంకర్ కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం గమనార్హం. జనసేనలో కమ్మ సామాజిక వర్గం నాయకుల్లో ఒకే ఒక్కడు హరిశంకర్. అతిముఖ్యమైన టీటీడీ చైర్మన్ టీడీపీ సూచించిన వ్యక్తికే ఇచ్చారు కాబట్టి.. తిరుపతిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన తాతాయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ పదవిని మాత్రం జనసేనకే కేటాయించాలని ఎమ్మెల్యేతో పాటు, ఆ పార్టీ తిరుపతి ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్, మిగిలిన వారంతా పట్టుబడుతున్నారు. ఇందుకు టీడీపీ నేతలు మాత్రం ససేమిరా అంటున్నారు. అందులో భాగంగా శనివారం టీడీపీ నేతలు ఎవరికి వారు తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ అని ప్రచారం చేసుకున్నారు. అలా ప్రచారం చేసుకుంటున్న వారిలో ఆనందబాబు యాదవ్, ఆర్సీ మునికృష్ణ, తులసీరాం, బుజ్జిబాబు నాయుడు ఉన్నారు. గంగమ్మ ఆలయ చైర్మన్ యాదవ సామాజిక వర్గం వారికి కేటాయించాలని కొందరు పట్టుబడుతున్నారు. అదే విధంగా కమ్మ, కాపు సామాజిక వర్గానికి చెందిన వారు తమకే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ పోటీలో ఎవరికి అమ్మవారు వరమిస్తారోనని తిరుపతి వాసులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఉద్యమిద్దాం రండి!

- ఫిబ్రవరి 5న ఫీజుపోరును విజయవంతం చేద్దాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి పిలుపు



మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దామని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షు లు భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పద్మావతిపురంలోని తన నివాసంలో శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నోటికొచ్చినట్లుగా అబద్ధాలు చెప్పి అందలమెక్కిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇప్పటికే కరెంట్ చార్జీల పెంపుపై ఉద్యమించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న విషయంపై ఫిబ్రవరి 5వ తేదీన 'ఫీజుపోరు' పేరుతో కలెక్టరేట్ల వద్ద ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి పేద విద్యార్థికి ఉన్నత విద్యనందించాలన్న లక్ష్యంతో దివంగత మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఫీజురీయింబర్స్ పథకాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా ఆ పథకాన్ని కొనసాగించిన గొప్ప నాయకుడు జగనన్న అని కొనియాడారు. అయితే చంద్రబాబు అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు ఫిబ్రవరి 5న ఫీజుపోరుపై ప్రతిఒక్కరూ ఉద్యమిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

28 నుంచి ఆరాధన మహోత్సవాలు

తిరుమల: కర్ణాటక సంగీత పితామహులు శ్రీ పురంధరదాసుల ఆరాధనా మహోత్సవాలు టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు తిరుమల ఆస్థాన మండపంలో ఘనంగా నిర్వహించనున్నారు. మొదటి రోజైన జనవరి 28న ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన కార్యక్రమాలు, పురంధర సాహిత్య గోష్ఠి, వివిధ పీఠాధిపతుల మంగళాశాసనాలు, మధ్యాహ్నం సంకీర్తన మాల కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చివరిరోజు జనవరి 30న ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన, హరిదాస రసరంజని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

28న 'హరిదాస రంజని'

జనవరి 28న తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో 'హరిదాస రంజని' గోష్ఠిగానం నిర్వహించనున్నారు.

వైద్యకళాశాలలో స్కౌట్ అండ్ గైడ్స్



స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభంలో ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాలలో హిందుస్థాన్ స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య కళాశాలలో తొలిసారి హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. వైద్య విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడంతో పాటు ఒత్తిడి నుంచి ఉపశమనం, సామాజిక సేవలు, పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ తెరిసా రాణి, స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ తుంగ శ్రీకాంత్, డిస్ట్రిక్ సెక్రెటరీ దయాకర్, డిస్ట్రిక్ ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకట సుమంత్, ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజర్ నవీన్, వైద్య కళాశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ కోఆర్డినేటర్ వర్మ, వైద్య విద్యార్థులు, పారా మెడికల్ విద్యార్థులు, పీఆర్‌ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

యువతా మేలుకో..ఓటు నమోదు చేసుకో!



ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ, కమిషనర్

తిరుపతి సిటీ: అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం నుంచి పద్మావతి మహిళా వర్సిటీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహిళా వర్సిటీ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి ప్రసంగించారు. 18 ఏళ్లు నిండిన యువత విధిగా ఓటు హక్కును పొందాలని సూచించారు. అనంతరం వీసీ ప్రొఫెసర్ ఉమ మాట్లాడారు. ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించారు. ఈఆర్‌ఓలకు, ఏఈఆర్‌ఓలకు, బీఎల్‌ఓలకు పత్రాలను అందజేశారు. వివిధ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, మెమెంటోలను అందజేశారు. డీఆర్‌ఓ హాజరయ్యారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు ఖాళీ గా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 57,665 మంది స్వామివారిని దర్శించుకోగా 20,051 మంది భక్తులు తలనీలాలు సమర్పించా రు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.73 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కె ట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంట ల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.83,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,555

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.93,600
రిటైల్ వెండి గ్రాము	రూ.96.60

క్లుప్తంగా

ఆరోగ్య భద్రతకు పటిష్ట చర్యలు



అంగన్‌వాడీ స్కూల్ పిల్లల ఆరోగ్యాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

తిరుపతి అర్బన్: ఆరోగ్య భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ పిలుపునిచ్చారు. శనివారం తిరుపతిలోని ప్రకాశం రోడ్డు సమీపంలోని అంగన్‌వాడీ స్కూల్, మున్సిపల్ పాఠశాలను ఆయన పరిశీలించారు. శిశు ఆరోగ్య స్క్రీనింగ్ పై మానిటరింగ్ నిర్వహించారు. ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. అంగన్‌వాడీ పరిధిలోని బాలింతలు, గర్భవతులకు అందించాల్సిన వైద్య సేవలను గుర్తుచేశారు. అలాగే విద్యార్థులకు ఆహారంతోపాటు ఆరోగ్య సూత్రాలను తెలియజేయాలని ఆదేశించారు. ప్రోగామ్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ క్రాంతి, డీఈఐసీ మేనేజర్ గుణశేఖర్, ఏఎన్ఎం సుగుణ, ఆశా వర్కర్ లక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన భాషా సంఘం సదస్సు

తిరుపతి సిటీ : కేంద్ర మానవ వనరులశాఖ, సంస్కృత వర్సిటీ, ఏబీఆర్ఎస్ఎమ్ సంయుక్త ఆధ్వర్యంలో భారతీయ భాషా సంఘం అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం ముగిసింది. సంస్కృత వర్సిటీ వేదికగా జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి హాజరై ప్రసంగించారు. అమెరికా, జర్మనీ, ఇంగ్లాండ్ వంటి దేశాల్లో సంస్కృత భాషపై పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. మన వేదాలు, ఉపనిషత్తుల్లోని అంశాలను ఆధునిక సాంకేతిక రంగంలో ఉపయోగించుకుంటూ లబ్ధి పొందుతున్నారని చెప్పారు. అనంతరం ఏబీఆర్ఎస్ఎమ్ జాతీయ సహ సంఘటన కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ.. మాతృభాష విలువైన వారసత్వ సంపద అన్నారు. సమావేశంలో ఏబీఆర్ఎస్ఎమ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, ప్రొఫెసర్ గణపతి భట్, కన్వీనర్ డాక్టర్ బుల్లిదాస్, కో–కన్వీనర్ డాక్టర్ కనపాల కుమార్, పలు విద్యా సంస్థల నుంచి అధ్యాపకులు పాల్గొన్నారు.



ముగింపు సభకు హాజరైన ముఖ్య అతిథులు

- డీడీఈ పరీక్షా కేంద్రాల కేటాయింపుపై విద్యార్థి సంఘాల ఆగ్రహం
- ప్రైవేటుపరం చేస్తున్నారంటూ మండిపాటు
- నిబంధనలను తుంగలో తొక్కితే పోరాటమే!

ఎస్వీయూ దూర విద్యాకేంద్రం



కాసులు ముట్టాయా.. కాపీ కొట్టొచ్చా!

తిరుపతి సిటీ: ఎస్వీయూలో అధికారులు తీసుకుంటున్న ప్రతి నిర్ణయం వివాదాస్పదమవుతోంది. డీడీఈ పరీక్షలను వాయిదాలతో కాలక్షేపం చేసి ఎట్టకేలకు వచ్చే నెల 3 నుంచి నిర్వహించాలని వర్సిటీ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్‌ను సైతం విడుదల చేశారు.

వర్సిటీ పరిధిలోని అన్ని స్టడీ సెంటర్లకు సమాచారం అందించారు. కానీ పరీక్షా కేంద్రాల కేటాయింపులో గందరగోళం సృష్టించారు. అవినీతికి పాల్పడి మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఉన్న ప్రైవేటు విద్యా సంస్థలలో పరీక్షా కేంద్రాలను కేటాయించారు. దీనిపై విద్యార్థి సంఘాల నాయకులు రగిలిపోతున్నారు. ఇదే అదునుగా స్టడీ సెంటర్ల యాజమాన్యాలు వర్సిటీ అధికారులతో కుమ్మక్కై పేద విద్యార్థుల నుంచి వేలకు వేలు వసూలు చేస్తున్నారు. దీంతో విద్యార్థి సంఘాలు ఏకమై పరీక్షా కేంద్రాలను ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు వీసీని కలిసి పలుమార్లు వినతి పత్రాలు సమర్పించారు.

డీడీఈ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల వివరాలు (సుమారు)	
మొత్తం డీడీఈ సెంటర్లు –	86
పరీక్షలు జరిగే డీడీఈ సెంటర్లు –	45
పీజీ (అన్ని కోర్సులు) –	7,500
యూజీ (బీఏ, బీకాం, బీఎస్సీ)–	22,600

న్యాయపోరాటం చేస్తాం



డీడీఈ పరీక్షలను ప్రభుత్వ విద్యా సంస్థలలో కాకుండా ప్రైవేటు కళాశాలలో నిర్వహిస్తే న్యాయపోరాటం చేస్తాం. ఉన్నత విద్యామండలి అధికారులతో పాటు గవర్నర్ కార్యాలయానికి ఫిర్యాదు చేస్తాం. దూరవిద్యా కేంద్రాల స్టడీసెంటర్ యాజమాన్యాల కనుసన్నులో నడుస్తున్న ప్రైవేటు సంస్థలలో మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీంతో విద్యార్థుల నుంచి మామూళ్లు వసూళ్లు చేసేందుకు కొన్ని సెంటర్ల యాజమాన్యాలు ఇప్పటికే ప్రయత్నాలను ముమ్మరం చేశాయి.
– పీ.సుందరరాజు, నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్, అధ్యక్షులు, ఎస్వీయూ

అవినీతి అంతు తేల్చాలి



ఎస్వీయూ డీడీఈ పరీక్షా కేంద్రాల కేటాయింపులో లక్షల చేతులు మారినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్సిటీ అధికారులు, స్టడీ సెంటర్ల నిర్వాహకుల మధ్య పెద్ద ఎత్తున అవినీతి జరిందనే విషయంపై సమగ్ర విచారణ చేపట్టి నిజాలను నిగ్గుతేల్చాలి. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.
– వినోద్‌కుమార్, ఎస్వీయూ ఎస్ఎఫ్ఐ, కార్యదర్శి

ప్రైవేటు పరీక్షా కేంద్రాలను రద్దు చేయాలి



ఎస్వీయూలో అధికారుల ఆగడాలకు అవదులు లేకుండా పోతున్నాయి. పేద విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు. డీడీఈ పరీక్షా కేంద్రాల ఏర్పాటులో అవినీతి రాజ్యమేలుతోంది. ప్రైవేటు పరీక్షా కేంద్రాలను వెంటనే రద్దు చేయాలి.
– ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్, జిల్లా కార్యదర్శి

తుది నిర్ణయం తీసుకోలేదు



డీడీఈ పరీక్ష కేంద్రాల కేటాయింపుపై ఇంత వరకు తుది నిర్ణయం తీసుకోలేదు. గతంలో అఫ్లియేటెడ్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. ఈ విషయంపై డీడీఈ అధికారులతో రివ్యూ మీటింగ్ జరిపి నిర్ణయం తీసుకుంటాం. విద్యార్థి సంఘాల నుంచి వినతి పత్రాలు వచ్చాయి. అన్ని విషయాలను పరిగణలోకి తీసుకుని సమావేశంలో చర్చిస్తాం.
– ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు, వీసీ, ఎస్వీయూ

నిబంధనలు పాటించకుంటే ఉద్యమిస్తాం



డీడీఈ పరీక్షల నిర్వహణలో అధికారులు అలసత్వం వహిస్తే సహించం. పరీక్షా కేంద్రాల కేటాయింపులో యూజీసీ, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో నిబంధనల ప్రకారమే కేటాయించాలి. అఫ్లియేటెడ్, ప్రైవేటు విద్యాసంస్థలలో పరీక్షలు నిర్వహిస్తే పూర్తి స్థాయిలో మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఉంటుంది. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు అమర్చాలి. ప్రైవేటు సంస్థలలో పరీక్షా కేంద్రాలను కేటాయిస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.
– శివశంకర్ నాయక్, గిరిజన నవసమాజ్ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎస్వీయూ

డ్రైవర్ల చేతిలో ప్రయాణికుల ప్రాణాలు



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్

తిరుపతి మంగళం: ప్రజల ప్రాణాలు డ్రైవర్ల చేతిలో ఉంటాయన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకుని వాహనాలు నడపాలని జిల్లా రవాణాశాఖాధికారి కొర్రిపాటి మురళీమోహన్ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఎస్వీసీఈ, అన్నమాచార్య, శ్రీరామ కళాశాలలతో పాటు వివిధ పాఠశాలల వాహన డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు, రోడ్డు భద్రతపై వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భద్రత ప్రధాన ధ్యేయంగా వాహన డ్రైవర్లను నిత్యం అప్రమత్తం చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం జిల్లా రవాణాశాఖ అధికారి మాట్లాడుతూ పేరెంట్స్ కమిటీ తీసుకోవాల్సిన బాధ్యతలను గుర్తుచేశారు. మనసు ప్రశాంతత లేనప్పుడే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఎంవీఐ సుబ్రహ్మణ్యం, శ్రీనివాస రావు మాట్లాడారు. ఎంవీఐలు అతికానాజ్, స్వర్ణలత, మోహన్‌కుమార్, వెంకటరమణనాయక్, ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల మధ్య ఘర్షణ



దాడిలో గాయపడిన పవన్‌కుమార్

చంద్రగిరి: పాత కక్షలలో ఆటో డ్రైవర్ల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో నలుగురు గాయపడ్డ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండల పరిధిలోని నరసింగాపురానికి చెందిన ఆటో డ్రైవర్లకు, శ్రీనివాసమంగాపురానికి చెందిన ఆటో డ్రైవర్లకు గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి రెడ్డివారిపల్లిలోని మద్యం దుకాణం వద్ద ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో గౌరీశంకర్, పవన్, రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో గౌరీశంకర్ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. ఘర్షణలో అడ్డొచ్చిన ఓ మహిళపై దాడి చేయడంతో గాయాలపాలైంది. శనివారం ఇరువర్గాల ఫిర్యాదులతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



మృతి చెందిన శతాధిక వృద్ధురాలు మునెమ్మ

చిట్టమూరు: శతాధిక వృద్ధురాలుగా గుర్తింపు ఉన్న కోరుటూరు కన్నెమ్మ(105) శనివారం మృతి చెందారు. ఐదు తరాల వారిని చూసిన ఆమె మృతి కుటుంబ సభ్యులను కలచివేసింది. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ 1920లో పుట్టిన మునెమ్మ శ్రీహరి కోట ప్రాంతం నుంచి చిట్టమూరుకు వచ్చి స్థిరపడ్డారని, ఐదు తరాల వారిని చూశారని చెప్పారు.

పకడ్బందీగా గణతంత్ర ఏర్పాట్లు



తిరుపతి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి అర్బన్: తిరుపతిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ వేదికగా ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఘ నంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పా ట్లు పూర్తి చేశారు. శనివారం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఏర్పాట్లను పర్యావేక్షించారు. తిరుపతి ఆర్డీఓ రామమోహన్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేపట్టారు. మొత్తం 11 శకరాలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే 13 స్టాల్స్‌ను నిర్వహిస్తున్నారు. 8 సాంస్కృతిక కార్యక్రమాలను చేపడుతున్నారు. 986 మంది ఉద్యోగులకు ఉత్తమ సేవల నేపథ్యంలో అవార్డులను ప్రదానం చేయనున్నారు. జేసీతోపాటు డీఆర్వో నరసింహులు, డీఈఓ కుమార్, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య పాల్గొన్నారు.

తమ అనుకూలురకే అవార్డులా?

ఉత్తమ సేవలందించిన 990 మంది ఉద్యోగులకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డులు ప్రదానం చేయనున్నారు. అందులో 38 మంది జిల్లా అధికారులకు అవార్డులను అందించనున్నారు. విభాగాల వారీగా అవార్డులకు ఎంపిక చేసే బాధ్యత ఆ విభాగానికి చెందిన ఓ జిల్లా అధికారికి అప్పగించారు. ఈ క్రమంలో ఉత్తమ సేవలందించిన వారికి కాకుండా తనకు అనుకూలంగా ఉన్నవారికి అవార్డులకు ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. దీంతో పలువురు ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పోలీస్ పరేడ్‌లో కవాతు

తిరుపతి క్రైం: ఎంఆర్‌పల్లి సమీపంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు నేతృత్వంలో శనివారం కవాతు నిర్వహించారు. 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రిహార్సల్స్ నిర్వహించినట్టు ఆయన పేర్కొన్నారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. అనంతరం డాగ్ విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

ఘనంగా ఓటర్ల దినోత్సవం

అంతర్జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ నిర్వహించారు.

కియా సిరోస్ కారు ఆవిష్కరణ



కియా సిరోస్ నూతన కారును ఆవిష్కరిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్, తదితరులు

చంద్రగిరి: చెన్నై – బెంగళూరు రహదారి తిరుచానూరు సమీపంలోని హోషి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ కియా కార్ షోరూంలో శనివారం సాయంత్రం కియా సిరోస్ నూతన కారు ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ సీ.జగన్నాథరెడ్డి, డైరెక్టర్ చెరకు నిరంజన్, సీ.భారతి, సీ.హోషిమారెడ్డితో పాటు ముఖ్య అతిథులు పాల్గొన్నారు. డీటీఓ మురళీమోహన్ చేతుల మీదుగా కారును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూం మేనేజింగ్ డైరెక్టర్ సీ.జగన్నాథరెడ్డి మాట్లాడుతూ కియా సిరోస్ కారులో అత్యాధునిక సదుపాయాలున్నాయన్నారు. రోబస్ట్ 20 స్టాండర్డ్ సేఫ్టీ ప్యాక్, 2వ వరుసలోని సీట్లు రీసైక్లిన్, స్లైడ్ వెంటిలేషన్, డ్యూయల్ పాన్ సన్‌రూఫ్, హార్మన్ కార్డన్ ప్రీమియంలో 8 స్పీకర్లలతో అత్యాధునిక మ్యూజిక్ సిస్టమ్, 30 ఇంచ్‌ల ట్రినిటీ డిస్ప్లేతో కారు నావిగేషన్, స్ట్రీమ్‌లైన్ డోర్ హ్యాండిల్స్‌ను అందించడం జరిగిందన్నారు. అదే విధంగా ఏడీఏఎస్ లెవల్ 2తో పాటు 16 అటానమస్ ఫ్యూచర్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆయన వెల్లడించారు. 8 రంగులలో ఈ కారు అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఈ కారు బుకింగ్ కోసం 86888 29739 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో షోరూం సీనియర్ మేనేజర్ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య



హత్యకు గురైన ఆంటోని

నాగలాపురం: ప్రియుడితో కలసి తన భర్తను హత్య చేసిన ఘటన శనివారం పిచ్చాటూరు మండలం, కీళ్లపూడి పంచాయతీ, గజసింగరాజపురం గ్రామంలో చోటు చేసుకుంది. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేష్ వివరాలను నమోదు చేసుకున్నారు. మృతుడు ఆంటోని (33) భార్య సుగంధి విజయపురం మండలం, ఇరుగువాయికు చెందిన అరుల్‌రాజుతో వివాహేతర సంబంధానికి ఒడిగట్టింది. అయితే భర్త అడ్డొస్తున్నాడన్న కారణంతో పథకం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి ప్రియుడు అరుల్‌రాజుతో కలసి నిద్రపోతున్న భర్త మెడకు తాడుకట్టి బిగించి హత్య చేసింది. ప్రాథమిక విచారణలో సైతం ఇది హత్యగా తేలింది. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. క్షణికావేశంతో తీసుకున్న ఈ నిర్ణయంతో పిల్లలు రోడ్డున పడ్డారని స్థానికులు, కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.